1 St Happy Work Anniversary. Year

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152


# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 169 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 09 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు
VOLUME : 02 ISSUE : 169 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 09 May 2025 PAGES : 8 PRICE : 3/-

## మా సహనాన్ని పరీక్షించొద్దు పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)

పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. 'నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్'లో మాట్లాడుతూ దేశభద్రతకు -మిగతా 2లో

## పాకిస్థాన్‌కు భారత్ షాక్ మీద షాక్

పాక్ మీడియా కంటెంట్‌పై భారత్ నిషేధం

ఓటీటీల్లో పాక్ సిరీస్‌లు బంద్

జాతీయ భద్రతే ముఖ్యమన్న కేంద్రం

పాక్ వెబ్ సిరీస్‌లపై నిషేధం

భారత్‌లో పాక్ కంటెంట్‌పై వేటు

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)

దేశ భద్రత దృష్ట్యా భారత ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పాకిస్థాన్‌లో రూపొందిన మీడియా ప్రసారాలపై భారత్‌లో నిషేధం విధిస్తూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం -మిగతా 2లో

## పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడ్డ భారత సైన్యం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)

భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది.

ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. ఈ క్రమంలోనే లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మెర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

## ఏపీని ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా మారుస్తాం




(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 8)

ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. "ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' -మిగతా 2లో

# కీలక నిర్ణయాలు తీసుకున్న ఏపీ కేబినెట్

ఏపీ రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ తీర్మానం

చెరువు మట్టిని రైతులకు ఉచితంగా తరలించేందుకు అనుమతి

వేదికలపై తన పక్కన పవన్ కల్యాణ్ కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 8)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక కీలకమైన నిర్ణయాలకు ఆమోదముద్ర లభించింది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, పరిపాలనా పరమైన పలు అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి కీలక తీర్మానాలు చేసింది.రాష్ట్ర మంత్రివర్గం 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఆపరేషన్ నిర్వహించిన త్రివిధ దళాలను అభినందిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అదేవిధంగా, అమరావతిలో పునర్నిర్మాణ పనులను ప్రారంభించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేబినెట్ ధన్యవాదాలు తెలియజేసింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది.ప్రధానంగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాష్ట్ర రాజధానిగా -మిగతా 2లో

## మోదీ పాలన కౌటిల్య నీతికి ప్రతిరూపం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంసలు

ప్రధాని మోదీ పాలన కౌటిల్యుడి తత్వానికి నిదర్శనమని ఉపరాష్ట్రపతి వ్యాఖ్య

ప్రధాని గొప్ప దార్శనికుడని, భారీ పరివర్తనను విశ్వసిస్తారని ప్రశంస

వేదకాలం నుంచే భారత్‌లో ప్రజాస్వామ్య విలువలున్నాయని ఉద్ఘాటన

భారత్ ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వాన్ని కోరుకునే దేశమని స్పష్టీకరణ

కశ్మీర్‌లో ఉగ్రవాదులపై ప్రతీకార చర్యల నేపథ్యంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక గొప్ప దార్శనిక నాయకుడని, ఆయన పాలనా విధానం కౌటిల్యుడి తత్వానికి ఆచరణాత్మక రూపమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంసించారు. కశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన తీవ్ర ప్రతీకార చర్యల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.గురువారం దేశ రాజధానిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రసంగించారు. "మన ప్రధానమంత్రి కౌటిల్యుడి తత్వాన్ని ఆచరణలో చూపించారు" అని ఆయన అన్నారు. పరిపాలనలోని ప్రతి అంశానికి, రాజనీతి, భద్రత, పాలకుల పాత్ర వంటి విషయాల్లో కౌటిల్యుడి ఆలోచనా విధానం ఒక సమగ్ర గ్రంథం వంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ దార్శనికతను కొనియాడుతూ, "మన ప్రధాని ఒక గొప్ప దార్శనికుడు. ఆయన భారీ స్థాయిలో, విస్తృతమైన పరివర్తనను విశ్వసిస్తారు. దశాబ్దకాల పాలన తర్వాత, ఫలితాలు మన కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని ధన్‌ఖడ్ పేర్కొన్నారు.భారతదేశం శాంతి కాముక దేశమని, ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం, ప్రపంచ సంక్షేమాన్ని ఎల్లప్పుడూ విశ్వసిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. మన దేశంపై దాడి చేసిన వారిని మాత్రమే సరిహద్దుల ఆవల లక్ష్యంగా చేసుకున్నామని, హనుమంతుడి సూత్రాలను సాయుధ దళాలు పాటించాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవచ్చు. భారతదేశపు ప్రాచీన నాగరికత, ప్రజాస్వామ్య విలువల గురించి ధన్‌ఖడ్ మాట్లాడుతూ, "భావప్రకటన, సంవాదం ఒకదానికొకటి పూరకంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం -మిగతా 2లో

## పాకిస్థాన్ కు నేడు అత్యంత కీలకం...

ఐఎంఎఫ్ కార్యనిర్వాహక మండలితో పాకిస్థాన్ సమావేశం

సుమారు 1.3 బిలియన్ డాలర్ల అదనపు నిధుల కోసం పాక్ అభ్యర్థన

పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయంపై ఐఎంఎఫ్‌కు భారత్ అధికారిక నిరసన



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి మరో విడత ఆర్థిక సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తోంది. అయితే, ఈ రుణ ప్రతిపాదనపై భారత్ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తోంది. పాకిస్థాన్‌కు అందించే నిధులను ఆ దేశం ఉగ్రవాద కార్యకలాపాలకు, తన సైనిక-గూఢచార వ్యవస్థల బలోపేతానికి పక్కదారి పట్టిస్తోందని భారత్ ఆరోపిస్తోంది. పాక్ పై భారత్ దాడుల నేపథ్యంలో ఐఎంఎఫ్ సమీక్షా సమావేశం మరింత ఉత్కంఠను రేపుతోంది. పాకిస్థాన్ ఎక్స్‌టెండెడ్ ఫండింగ్ ఫెసిలిటీ (ఈఎఫ్‌ఎఫ్) కింద పొందుతున్న రుణంలో -మిగతా 2లో

## ప్రధాని మోదీ ఓ 'అనికేత్'

అనికేత్ అంటే ఇల్లు లేని వాడని అర్థమన్న పవన్

శివుడికి కూడా అనికేత్ అనేది ఒక పేరు అని చెప్పిన డిప్యూటీ సీఎం

ఆపరేషన్ సిందూర్ కు పూర్తి మద్దతు తెలిపిన పవన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 8)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని, అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. ప్రధాని మోదీని "అనికేత్" అంటూ అభివర్ణిస్తూ, ఆయన నిస్వార్థ సేవానిరతిని కొనియాడారు. అదే సమయంలో, ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలకు, ముఖ్యంగా "ఆపరేషన్ సిందూర్"కు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీని "అనికేత్"గా పేర్కొంటూ పవన్ కల్యాణ్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. "'అనికేత్' ఒక పేరు, ఒక సంకల్పం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సన్యాస జీవితంలో 'అనికేత్' అని పిలువబడ్డారు. అనికేత్ అంటే 'ఇల్లు లేనివాడు' అని అర్థం" -మిగతా 2లో

## IC814 హైజాక్ మాస్టర్‌మైండ్ అబ్దుల్ రవూఫ్ అజహార్ హతం..



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)

ఆపరేషన్ సిందూర్‌లో భారత్ చిరకాల ప్రతీకారం కూడా తీరింది. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్‌కు మాస్టర్‌మైండ్, జైషే ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అజహార్ కూడా హతమయ్యాడు. బహావల్‌పుర్‌లోని మర్కజ్ సుబాన్ కాంప్లెక్స్‌పై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు కలిపి 14 మంది మరణించారు. వీరిలో రవూఫ్ అజహార్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో అజహార్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, అతడి భార్య సహా పలువురు మృతి చెందినట్లు చెబుతున్నారు. రవూఫ్ అజహార్ పలు ఉగ్రదాడుల్లో నిందితుడు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో ఇతడు కూడా ఉన్నాడు. 2002లో ఉగ్రవాదంపై రీసెర్చ్ చేస్తున్న పెర్ల్ కొంత మంది మతపెద్దలను కలిసేందుకు పాక్‌లోని కరాచీకి వెళ్లాడు. కాందహార్ హైజాక్ సందర్భంగా ఉగ్రవాదులు విడిపించిన ఒమర్ షేక్ ఓ హోటల్ నుంచి పెర్ల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. 1999లో జరిగిన ఐసీ814 విమాన హైజాక్‌లో కూడా రవూఫ్ అజహార్ హస్తం ఉంది. ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్‌కు చేర్చారు. అక్కడి నుంచి భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. భారత జైళ్లలో ఉన్న మసూద్ అజహార్, -మిగతా 2లో

## మొదటిపేజీ తరువాయి

## మా సహనాన్ని పరీక్షించొద్దు పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్

సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు."మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

**సైన్యంపై ప్రశంసలు..** భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు.

## పాకిస్థాన్‌కు భారత్ షాక్ మీద షాక్

స్పష్టం చేసింది. ఓటీటీ వేదికలతో పాటు, ఇతర డిజిటల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారమయ్యే పాకిస్థానీ వెబ్‌సిరీస్‌లు, సినిమా పాటలు, పాడ్‌కాస్ట్‌ల వంటి కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నిషేధాజ్ఞలు వెంటనే అమల్లోకి వస్తాయని, సంబంధిత వేదికలు దీన్ని కచ్చితంగా పాటించాలని సూచించింది. ఇకపై భారతీయ ప్రేక్షకులు పాకిస్థానీ కంటెంట్‌ను అధికారికంగా వీక్షించే వీలుండదు.

## మోదీ పాలన కౌటిల్య నీతికి ప్రతిరూపం

పరిఢవిల్లుతుంది. మన రాజ్యాంగం అమల్లోకి రావడంతోనో, స్వాతంత్ర్యం రావడంతోనో మన దేశంలో ప్రజాస్వామ్యం ప్రారంభం కాలేదు. వేల సంవత్సరాలుగా మనం ఆత్మతః ప్రజాస్వామ్య దేశంగా ఉన్నాం" అని వివరించారు. వేద సంస్కృతిలో భావప్రకటన, వాదవివాదాల సమన్వయ విధానాన్ని 'అనంత వాద్' అని పిలిచేవారని ఆయన తెలిపారు. ఈ ఆదర్శాలు, విలువల కారణంగానే 60 ఏళ్ల తర్వాత ఒక ప్రధానమంత్రి మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశం లభించిందని ఆయన అన్నారు.

## కీలక నిర్ణయాలు తీసుకున్న ఏపీ కేబినెట్

అమరావతి పేరును చేర్చే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఏపీ రాజధాని అమరావతి అని స్పష్టం చేస్తూ కేబినెట్ తీర్మానించింది. ఈ తీర్మానం కాపీని కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది.సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాల అమలుపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై కూడా మంత్రులు చర్చించారు.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏపీ పర్యటన సందర్భంగా ప్రధాన వేదికపై సీటింగ్ ఏర్పాట్ల అంశం కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. కేంద్ర మంత్రులను ఒకవైపు, రాష్ట్ర మంత్రులను మరోవైపు కూర్చోబెట్టేలా ప్రోటోకాల్ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. తన పక్కన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.జలవనరుల శాఖ పరిధిలో కంపెనీల చట్టం కింద జల హారతి కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని చెరువులలో పూడికతీత ద్వారా లభించే మట్టిని రైతులు తమ పొలాలకు ఉచితంగా తరలించుకునేందుకు అనుమతిస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అర్బన్ డిజైన్ ప్లానింగ్ సెల్ ఏర్పాటుకు, అలాగే పర్యాటక ప్రాజెక్టులలో ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహకాలు అందించేందుకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

## IC814 హైజాక్ మాస్టర్‌మైండ్ అబ్దుల్ రవూఫ్ అజహర్ హతం..

అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్ అనే ఉగ్రవాదులను విడిపించుకొని తీసుకెళ్లారు. ఆ తర్వాతే మసూద్ అజహర్ జైషే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. ఇక 2001లో జరిగిన పార్లమెంట్‌పై దాడి, 2016లో పఠాన్ కోట్ దాడి, 2019లో పుల్వామా బాంబింగ్ వంటి ఉగ్ర ఘటనల్లో రవూఫ్ ప్రమేయం ఉంది. ప్రస్తుతం జైషే మొహమ్మద్ కీలక కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## పాకిస్థాన్ కు నేడు అత్యంత కీలకం...

భాగంగా, మొదటి సమీక్ష కోసం రేపు ఐఎంఎఫ్ కార్యనిర్వాహక మండలితో సమావేశం కానుంది. ఈ సమావేశంలో మరో 1.3 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని పాకిస్థాన్ అభ్యర్థించనుంది. ఇప్పటికే నగదు కొరతతో సతమతమవుతున్న పాకిస్థాన్‌కు ఈ నిధులు అత్యంత కీలకంగా మారాయి.పాకిస్థాన్ ప్రస్తుతం తీవ్ర ద్రవ్యలోటును ఎదుర్కొంటోంది, తన ఆర్థిక స్థిరీకరణ కార్యక్రమం కోసం ఐఎంఎఫ్ మద్దతుపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. మే 9న జరగనున్న సమీక్షలో, తదుపరి విడత నిధుల విడుదలకు అవసరమైన సంస్కరణల ప్రమాణాలను పాకిస్థాన్ ఎంతవరకు పాటించిందో ఐఎంఎఫ్ మూల్యాంకనం చేయనుంది.

కాగా, 2023లో ఐఎంఎఫ్ నుంచి పాకిస్థాన్ 7 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీని పొందింది. దీనికి అదనంగా, వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్లను తట్టుకునేందుకు మార్చి 2024లో మరో 1.3 బిలియన్ డాలర్ల సహాయాన్ని కూడా అందుకుంది.

## ప్రధాని మోదీ ఓ 'అనికేత్'

అని వివరించారు. సృష్టికి శాశ్వత సన్యాసి అయిన శివునికి కూడా "అనికేత్" ఒక పేరని గుర్తుచేశారు. "వారికి (శివునికి) విశ్వంలోని ప్రతి కణం ఒక ఇల్లు. అయినప్పటికీ వారికి సొంత ఇల్లు లేదు. నేడు కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుండి ద్వారక వరకు మొత్తం భారతదేశాన్ని తనదిగా భావించిన అదే 'అనికేత్' (మోదీ), స్వయంగా ఇల్లు లేనప్పటికీ, 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' కింద కోట్లాది మందికి ఇళ్లను అప్పగించారు" అంటూ ప్రశంసించారు.

## ఏపీని ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా మారుస్తాం

వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది" "ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం" అని లోకేశ్ అన్నారు.

## ట్రంప్ సుంకాల తర్వాత తొలి డీల్... యూకేతో!



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్‌లో దాదాపు అన్ని వాణిజ్య భాగస్వామ్య దేశాలపై భారీ సుంకాలను విధించిన తర్వాత, మొట్టమొదటి వాణిజ్య ఒప్పందం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో కుదిరినట్లు గురువారం ప్రకటించారు. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో అధ్యక్షుడు ట్రంప్, యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఫోన్ ద్వారా పాల్గొని ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. అంతకుముందు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ డీల్ గురించి వెల్లడించారు. "గత అధ్యక్షులు పట్టించుకోని విధంగా, అమెరికాకు ఇది మొట్టమొదటి న్యాయమైన, బహిరంగ, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం. మన బలమైన మిత్రదేశమైన యూకేతో కలిసి, ఏప్రిల్ 2న (సుంకాలు ప్రకటించిన రోజు) విమోచన దినోత్సవం తర్వాత ఈ చారిత్రక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు.ఈ ఒప్పందం ద్వారా యూకే తమ దేశ మార్కెట్‌ను మరింతగా తెరుస్తోందని, అమెరికా వస్తువులకు కస్టమ్స్ ప్రక్రియలో ఎటువంటి అధికార జాప్యం లేకుండా వేగంగా అనుమతులు లభిస్తాయని ట్రంప్ తెలిపారు. "ఇరువైపులా వాణిజ్యం చాలా వేగంగా జరుగుతుంది" అని ఆయన అన్నారు.ఒప్పందం పూర్తి వివరాలు ఇంకా ఖరారు కానప్పటికీ, ట్రంప్ కొన్ని కీలక అంశాలను వెల్లడించారు. "ఈ డీల్ ద్వారా, 10% సుంకాల నుంచి అమెరికాకు 6 బిలియన్ డాలర్ల ఆదాయం, మన పశువుల పెంపకందారులు, రైతులు, ఉత్పత్తిదారులకు 5 బిలియన్ డాలర్ల కొత్త ఎగుమతి అవకాశాలు లభిస్తాయి. అలాగే, అల్యూమినియం, ఉక్కు వాణిజ్య మండలి ఏర్పాటు, సురక్షితమైన ఔషధ సరఫరా వ్యవస్థ ద్వారా అమెరికా, యూకేల జాతీయ భద్రత పెంపొందుతుంది" అని ట్రంప్ వివరించారు.ఫోన్‌లో పాల్గొన్న యూకే ప్రధాని కీర్ స్టామర్ మాట్లాడుతూ, "ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందాన్ని ప్రకటించడం నిజంగా అద్భుతమైన, చారిత్రక దినం. మనం కలిసికట్టుగా పనిచేసే చరిత్రకు ఇది నిదర్శనం" అని హర్షం వ్యక్తం చేశారు.కాగా, అమెరికా ప్రస్తుతం భారత్‌తో సహా పలు దేశాలతో వాణిజ్య చర్చలు జరుపుతోంది. భారత్‌తో కూడా త్వరలోనే ఓ ఒప్పందం కుదురుతుందని అమెరికా అధికారులు ధీమా వ్యక్తం చేశారు. అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన చైనాతో శనివారం స్విట్జర్లాండ్‌లో తొలి వాణిజ్య చర్చలు జరగనున్నాయి.

# ఉద్రిక్తతలకు తెరలేపింది పాకిస్థానే 'ఆపరేషన్ సిందూర్'పై భారత్



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని, సైనిక స్థావరాలు కాదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తలకు తొలుత పాకిస్థాన్ తెరలేపిందని పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో పాక్ ఉగ్రమూకల దాడితో ఇది మొదలైందని తెలిపింది. అంతర్జాతీయ సమాజానికి దాయాది దేశం తప్పుడు సమాచారం అందిస్తోందని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ వివరాలు వెల్లడించారు.

**ఐరాసకు ఆధారాలు..** "పహల్గాం దాడులకు తామే బాధ్యులమని టీఆర్ఎఫ్ రెండుసార్లు ప్రకటించుకుంది. మరోవైపు.. తమ దేశంలో ఉగ్రవాదులు లేరని పాక్ చెబుతోంది. టీఆర్ఎఫ్ అనేది లష్కరే తొయిబా ముసుగు సంస్థ అని ఎన్నోసార్లు చెప్పాం. ఐరాసలో పహల్గాం ఉగ్రదాడి చర్చల్లో టీఆర్ఎఫ్ పాత్రను పాక్ వ్యతిరేకించింది. అయితే, దీనిపై తగిన ఆధారాలను ఐరాసకు ఇప్పటికే అందించాం. ఆ సంస్థ గురించి వివరించాం" అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.

**ఉగ్రవాదులకు అధికారికంగా అంత్యక్రియలు..** "ఉగ్రవాదానికి పాకిస్థాన్ కేంద్రంగా ఉందనే విషయం ఇప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంతో భారత్ తీవ్రంగా నష్టపోయింది. ముంబయి, ఉరి, పుల్వామా, పఠాన్‌కోట్ దాడులు కొన్ని ఉదాహరణలు. ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయం ఉందన్న ఆధారాలను ఎన్నోసార్లు బయటపెట్టాం. ఎన్ని ఆధారాలు చూపినా.. పాక్ పట్టించుకోలేదు. ఉగ్రవాద వ్యతిరేక దర్యాప్తులను నిలిపివేసింది. ఒసామా బిన్ లాడెన్‌ను అమరవీరుడని ఎవరు కొనియాడారో చెప్పక్కర్లేదు. ఐరాస నిషేధించిన ఉగ్రవాదులకు పాకిస్థాన్ నిలయంగా ఉంది. ఉగ్రవాదాన్ని వదులుకునేందుకు పాక్ ఇప్పటికీ సిద్ధంగా లేదు. ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయడం పాక్‌లో ఆచారం" అని విదేశాంగశాఖ కార్యదర్శి వెల్లడించారు.

**మతం రంగు..** "ఆపరేషన్ సిందూర్'లో సామాన్య పౌరులు చనిపోయారనేది అవాస్తవం. ప్రార్థనా స్థలాలపై దాడి చేశామనేది కూడా అబద్ధమే. పాకిస్థాన్ స్థానికంగా కొన్ని ప్రార్థనా స్థలాలను దుర్వినియోగం చేస్తూ ఉగ్రస్థావరాలుగా చేసుకున్న మాట వాస్తవమే. పైగా.. సిక్కులను లక్ష్యంగా చేసుకొని కశ్మీర్‌లోని గురుద్వారాలపై దాడులు చేస్తోంది. తాజా దాడుల్లో ముగ్గురు సిక్కులు చనిపోయారు. సామాన్య పౌరులపై ఆ దేశం దాడులు చేస్తోంది. ఇప్పటివరకు 16 మంది చనిపోయారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పాకిస్థాన్ మతం రంగు పులుముతోంది. దాయాది దాడులను భారత్ ప్రజలు మతాలకు అతీతంగా ఖండిస్తున్నారు. సామాన్యులపై దాడులు చేస్తూ పాకిస్థాన్ ఉద్రిక్తతలను తీవ్రతరం చేస్తోంది" అని విక్రమ్ మిస్రీ తెలిపారు.

**సింధూ జలాలపై దుష్ప్రచారం..** "సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘిస్తోందని పాక్ దుష్ప్రచారం చేస్తోంది. 60 ఏళ్లుగా ఆ ఒప్పందాన్ని గౌరవించాం. స్నేహంలో భాగంగానే అది అమలవుతుందని ఆనాటి ఒప్పందంలో ఉంది. సీమాంతర ఉగ్రవాదాన్ని పాక్ ప్రోత్సహిస్తున్నందుకే దాని అమలును నిలిపేశాం. పాకిస్థాన్ ప్రస్థానమే అబద్ధాలతో మొదలైంది. అసత్యాలు పలకడం పాక్‌కు అలవాటే. అది మాకు ఆశ్చర్యం కలిగించలేదు. నీలం-జీలం ప్రాజెక్టును భారత్ లక్ష్యంగా చేసుకుందని పాక్ తప్పుడు ప్రచారం చేస్తోంది. సైనిక స్థావరాలు లక్ష్యంగా చేసుకోలేదు. కేవలం ఉగ్రస్థావరాలే భారత్ లక్ష్యమని చెప్పాం. అసత్య ప్రచారాల పర్యవసానాలకు పాకిస్థాన్‌దే బాధ్యత" అని విదేశాంగశాఖ వెల్లడించింది.

**దీటుగా బదులిస్తాం..** "ఆపరేషన్ సిందూర్' అనేది పాకిస్థాన్ దుశ్చర్యకు సమాధానం మాత్రమే. పౌరులను కాపాడుకునే భారత హక్కును ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయి. పహల్గాం దాడిపై బదులిచ్చే హక్కు భారత్‌కు ఉందని ప్రపంచదేశాలు గుర్తిస్తున్నాయి. పహల్గాం ఘటనపై పాక్ సంయుక్త విచారణ కోరుతోంది. అలా కోరే అర్హత ఆ దేశానికి లేదు. ముంబయి దాడులు, పఠాన్‌కోట్ ఘటనల్లో నేర విచారణకు పాక్ సహకరించలేదు. ఎన్ని ఆధారాలు చూపించినా విచారణను ముందుకు సాగనివ్వలేదు. పాక్ ఎలాంటి చర్యలు తీసుకున్నా.. దీటుగానే భారత్ బదులిస్తుంది" అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.

## సరిహద్దులో ఉద్రిక్తతల వేళ.. హఠాత్తుగా న్యూఢిల్లీకి సౌదీ మంత్రి..

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 8)**

భారత్-పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ.. సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీకి వచ్చారు. ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్‌జుబైర్ నేడు ఢిల్లీకి వచ్చారు. ఆయన మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది. దీనిపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఎక్స్‌వేదికగా పోస్టు చేశారు.

"సౌదీ అరేబియా మంత్రి అదెన్ అల్ జుబైర్‌తో సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని ఆయనకు వివరించాను" అని జైశంకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా సౌదీ మంత్రితో భేటీ జరిగింది. ఆ తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో మన విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇప్పటికే భారత్-పాక్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. "సోదరుల్లాంటి పొరుగుదేశాలే మాకు అత్యున్నత ప్రాధాన్యం" అని పేర్కొన్నారు. అంతేకాదు.. భారత్, పాక్‌లోని తమ దౌత్యకార్యాలయాల సహకారంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గిస్తామని పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను కూడా అరాఘ్చి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే సందర్శించారు. అక్కడి నాయకులతో చర్చించి.. తిరిగి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తర్వాత న్యూఢిల్లీకి వచ్చారు.





# ఉపాధి పనులు పటిష్టంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

4

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



# కన్వీనర్ల ఎంపికలో వీడని సందిగ్ధత

## పార్టీ కోసం పనిచేసే వారికి మొండిచేయి

## వీడని ఉత్కంఠ

## పార్టీ కోసం పని చేసినా గుర్తింపు లేదని అసంతృప్తిలో కీలక నాయకులు

## ఎటు తేల్చని కన్వీనర్ల ఎంపిక ఏకాకైనా ఎమ్మెల్యే తాటిపర్తి..!

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 8)**

పెద్దారవీడు, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలలో మండల కన్వీనర్ల ఎంపిక గత కొన్ని నెలలుగా సందిగ్ధత వీడటం లేదు. పార్టీలో కష్టపడి పనిచేసి, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న వారిని విస్మరిస్తూ మాజీ మంత్రి వర్గం వారి పట్ల ఎమ్మెల్యే అనుకూలత ఉండటంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఇటీవల జరిగిన కార్యక్రమాల్లో మండల పార్టీ నాయకత్వం, కిందిస్థాయి నాయకులు ఎమ్మెల్యే వెంట లేకపోవడంతో అసంతృప్తులు ఒక్కసారిగా బయటపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీకి మంచి ఆదరణ ఎక్కువగానే ఉంది. దీనిలో భాగంగానే పెద్దారవీడు మండలంలో వైసీపీకి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి బలం కలిగిన పార్టీగా నెలకొంది. ఈ నేపథ్యంలోనే పార్టీ నాయకత్వం, కీలక నాయకులు మండల కన్వీనర్ పదవికి పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండల కన్వీనర్ ఎంపిక ను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఏటు తేల్చని పరిస్థితి నెలకొన్నది. ఎంపిక చేయటంలో జాప్యం చోటు చేసుకోవటంతో వైకాపాలోని కొన్ని వర్గాల వారు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. నిన్నటి మొన్నటి వరకు ఎమ్మెల్యే వెంట నడిచిన నాయకులు కూడా నేడు ఆయన వెంట కనిపించని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే పలు దపాలుగా మండల కన్వీనర్ పదవి చేసినా వ్యక్తి పట్లనే ఎమ్మెల్యే అనుకూలంగా ఉండటంతో వైసీపీలోని మరొక వర్గం వారు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు తిరిగిన నాయకులను సొంత బిడ్డలు అంటూనే పరోక్షంగా మరొక వ్యక్తికి మండల కన్వీనర్ పదవి కట్టబెడుతున్నాడు అనే సమాచారం తెలియడంతో పార్టీలో వర్గ విభేదాలు ఒక్కసారిగా ఇప్పటిప్పుడే బయటకు వస్తున్నాయి.

### మండల కన్వీనర్ రేసులో త్రిముఖ పోటీ

పెద్దారవీడు మండల వైసీపీ కన్వీనర్ ఎంపిక ఎమ్మెల్యే తాటిపర్తికి కత్తి మీద సాములా తయారైంది. ఇప్పటికే మండల కన్వీనర్ పోటీకి త్రిముఖ పోటీ రావడంతో ఎవరిని ఎంపిక చేయాలని ఆలోచనలోనే గత కొన్ని నెలలుగా ఎంపిక చేయకుండా , కాలం వెల్ల తీసుకు రావడంతో మరొక వర్గం అసంతృప్తిగా ఉన్నారు. గతంలో పనిచేసిన వ్యక్తి పట్లనే ఎమ్మెల్యే అనుకూలంగా ఉండడంతో ఇప్పటివరకు ఎన్నికల్లో కష్టపడి పనిచేసి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వారికి తాటిపర్తి మొండి చేయి చూపిస్తున్నారనే అనుమానం పార్టీ శ్రేణులలో ఏర్పడినట్లు సమాచారం. ఈ విషయంలోనే ఎటు తేల్చుకో పోవడంతో కార్యకర్తల్లో కొంత నిరుత్సాహం నెలకొన్నది. పార్టీ అగ్ర నాయకత్వం పెద్దారవీడు మండల కన్వీనర్ల ఎంపికలో దృష్టి పెట్టి వెంటనే నియమించి పార్టీలో వస్తున్న అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నం చేయాలని పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తలు కోరుకుంటున్నారు.

### ఇప్పటికే దోర్నాల, యర్రగొండపాలెం పూర్తయినా..

మండల కన్వీనర్ల ఎంపికలు దోర్నాల, యర్రగొండపాలెం మండలాల కన్వీనర్ల ఎంపిక చేసి నెలరోజులు దాటిపోయిన పెద్దారవీడు మండలం పై దృష్టి పెట్టకపోవడంతో నాయకులు, క్యాడర్ నిరుత్సాహంలో ఉన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ అక్కడ కన్వీనర్ ఎంపిక సులభంగానే జరిగిపోయింది. దోర్నాలలో గతంలో చేసిన వ్యక్తికే కట్టబెట్టడం గమన హారం. పెద్దారవీడు మండల ఎంపికలో ఎమ్మెల్యే పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో రెండు వర్గాలు ఆసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

గత నెలలో జరిగిన ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రెండు వర్గాలుగా చీలిపోయిన నాయకులు బర్త్‌డే కేక్ లు కోసి విడివిడిగా బర్డే చేసుకోవడం కోసం మెరుపు. మరొక వర్గం వారు బర్డే వేడుకల్లో పాల్గొనలేదని తెలిసినది. ఇటువంటి తరుణంలో కన్వీనర్ల ఎంపిక ఎటువైపు ఎమ్మెల్యే ముగ్గు చూపుతారు అని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విద్యుత్ శాఖపై జగన్‌వి తప్పుడు ప్రచారాలు

- వైసీపీ ప్రభుత్వంలో యూనిట్ రూ.9.30కి కొనుగోలు
- యాక్సిస్ ఒప్పందంతో రైతులకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు
- గత ప్రభుత్వ ఐదేళ్లలో తొమ్మిది సార్లు పెంచిన విద్యుత్ ఛార్జీలు
- వైసీపీ హయాంలో రూ.1.29 లక్షల కోట్ల రుణ భారం
- అవినీతి సొమ్ముతో ఏర్పడ్డవే సాక్షి పేపర్, వైసీపీ పార్టీ
- ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు పదే పదే తప్పుడు రాతలు
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 8)**

విద్యుత్ శాఖ పై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చేసేవన్నీ తప్పుడు ప్రచారాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి గురువారం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. యాక్సిస్, బ్రూక్ ఫీల్డ్ కంపెనీతో కూటమి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాల పై అవినీతి సొమ్ముతో ఏర్పాటు చేసిన సాక్షి మీడియాను అడ్డం పెట్టుకుని జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం లో సెకీ నుంచి రూ.2.49కి విద్యుత్ కొనుగోలు చేసామనేది పచ్చి అబద్ధమని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ట్రాన్స్మిషన్ లాసెస్, ఇతర ఖర్చులన్నీ కలిపితే రూ. 5 పైనే ఖర్చు చేయాల్సి వస్తుందని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అత్యధిక విద్యుత్ వినియోగం జరిగే సమయంలో ఒత్తిడిని తట్టుకునేందుకు, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ అందించేందుకు యాక్సిస్ బ్రూక్ ఫీల్డ్ ఒప్పందాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఒప్పందాలతో రాయలసీమ ప్రాంతంలో 400 మోగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఈ ఒప్పందం ద్వారా పీక్ అవర్స్ లో కూడా యూనిట్ రూ.4.60కే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి హయాంలో 2022 లో రూ.5.12కు నాటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే.. మా ప్రభుత్వం యూనిట్ విద్యుత్ ను రూ.4.60కి తగ్గించి ఒప్పందం చేసుకున్నామని వివరించారు. 1,700 ఎకరాలను రైతుల నుంచి తీసుకుని వారికి ఏడాదికి రూ.31,000 కౌలు అందిస్తున్నామని అన్నారు. అంతేగాక రాష్ట్రానికి యాక్సిస్ ఎనర్జీ నుంచి 9 శాతం జీఎస్టీ రూపంలో ఆదాయం లభిస్తుందన్నారు. యాక్సిస్ ఎనర్జీ తన పెట్టుబడులను ఏపీలో పెట్టిందని దీని ద్వారా.. విద్యుత్ కొనుగోళ్లు చేస్తుండటం వల్ల ట్రాన్స్మిషన్ లాస్‌లు లాంటివి ఉండవని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఇటువంటి ఒప్పందాల ద్వారా విద్యుత్ ఛార్జీలు తగ్గించి ప్రజలపై భారం లేకుండా చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడిదారుల్ని తరిమికొట్టిన చరిత్ర జగన్ ది అయితే, పెట్టుబడులు ఆహ్వానించి రాష్ట్రానికి ఆదాయం సమకూరుస్తూ ఉపాధి కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదని మంత్రి గొట్టిపాటి కొనియాడారు. (తరువాయి 4లో...)




# ఎపిని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ గా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం బాటలు

**మేడ్ ఇన్ ఆంధ్ర నుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు**
**జైత్రయాత్ర కొనసాగుతుంది**
**స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపనున్న ఎల్ జి యూనిట్**
**రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక తొలి ఎఫ్ డిఐ శ్రీసిటీ ఎల్ జి యూనిట్**
**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా ఎపి**
**ఎల్ జి శ్రీసిటీ యూనిట్ కు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ భూమిపూజ**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)**

రాష్ట్రంలో సృష్టించబడే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్ గా మార్చేందుకు బాటలు వేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. అంతర్జాతీయస్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్ జి ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ యూనిట్ కు లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూమేం ఈరోజు ఎల్ జి యూనిట్ కు మాత్రమే కాదు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు ప్రారంభం కంటే పెద్దది. ఇది మన రాష్ట్రంతోపాటు భారతదేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. ఆవిష్కరణ పెట్టుబడిని కలిసే చోట, భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది. 5,000 కోట్లకు పైగా పెట్టుబడితో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ స్థాయి తయారీ యూనిట్‌ను తీసుకురావడమే గాక ఎపిని పెట్టుబడుల గమ్యస్థానంగా ప్రపంచ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తోందిమేడ్ ఇన్ ఆంధ్ర నుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా ఎల్ జి శ్రీసిటీ యూనిట్ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలుఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై చంద్రబాబునాయుడు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. మేము సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంమేగాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం. శ్రీసిటీలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ అత్యాధునిక తయారీ కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా మీ ముందుకు రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. (తరువాయి 4లో...)



# ఎపిని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ గా మార్చేందుకు

# ప్రజా ప్రభుత్వం బాటలు





ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జు జియోన్, ఎల్‌జి, దాని విక్రేత కంపెనీల నాయకత్వ బృందాలు, భాగస్వాములందరికీ నేను హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను.

**మేము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం....**

ఎల్‌జి ఫ్యాక్టరీ అధునాతన గృహోపకరణాలైన రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు స్మార్ట్, ఇంధన సమర్థవంతమైన సాంకేతికతతో ఉత్పత్తులను అందిస్తుంది. ఒక స్మార్ట్ ఫ్యాక్టరీ, ఒక స్మార్ట్ రాష్ట్రం, ఒక స్మార్ట్ దేశం యొక్క సరికొత్త ప్రయాణం ఈరోజు ప్రారంభమవుతుంది. ఇది కేవలం తయారీ గురించి కాదు,ఇది జీవన భవిష్యత్తును రూపొందించడం గురించి. ఇది ఉద్యోగాలను సృష్టించడం, మన యువతకు సాధికారత కల్పించడం, జీవితాలను మార్చడం గురించిమేము కేవలం కర్మాగారాలను నిర్మించడం లేదుబీ మేము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఎల్ జి ప్రధాన యూనిట్ దాదాపు 1,500 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఎల్‌జి ముఖ్య విక్రేతలు అదనంగా ?839 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా మరో 690 కి పైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తారు. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన భారీ ప్రభావాన్ని చూపుతుంది. ఇది కంపెనీకి ఒక కొత్త ఆవిష్కరణ కంటే ఆంధ్రప్రదేశ్ యువతకు కలల సాకార క్షణం. ఎల్‌జి సప్లయ్ చైన్ ను మరింత బలోపేతం చేయడమేగాక దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించే హైటెక్ యూనిట్. ఎల్ జి నాలుగు కీలక విక్రేత భాగస్వాములైన ఎకోరియా, కురోడా ఎలక్ట్రిక్, హేంగ్ సంగ్ ఇండియా, క్యుంగ్‌సంగ్ ప్రెసిషన్ అండ్ టేసంగ్ ఎలక్ట్రానిక్స్ భాగస్వామ్య శక్తి పురోగతికి పాస్‌పోర్ట్ లాంటివి. ఇది వారి ఉమ్మడి సహకార వృద్ధి శక్తిని చాటడమేగాక ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ తనను తాను ఎలా నిలబెట్టుకుంటుందో కూడా ప్రపంచానికి చూపిస్తుంది.

**వాణిజ్యానికి ఎపి గేట్లు తెరిచే ఉన్నాయ్...**

ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు ఆంధ్ర ఆశయాన్ని నెరవేర్చినప్పుడు మాయాజాలం జరుగుతుంది. ఎల్‌జి సంస్థ, దాని భాగస్వాములు కలిసి భారతీయ గడ్డపై ఏ1 ఆధారిత తయారీ, స్మార్ట్ ఉత్పత్తి ప్రక్రియలు, ఎనర్జీ ఎఫిషియంట్ విధానాలు, అత్యాధునిక సాంకేతికతలను తీసుకువస్తున్నారుఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రపంచస్థాయి కేంద్రంగా ఎపిని మార్చాలనే మా ఆశయాన్ని ఎల్ జి సంస్థ ముందుకు తీసుకెళ్తోంది. శ్రీ సిటీ పారిశ్రామిక పురోగతికి ఒక చుక్కానిలా మారింది. ఇలాంటి ప్రాజెక్టులతో మేము మేము ఎపి భవిష్యత్తును నిర్మిస్తున్నాం, స్మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తున్నాం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. భూసేకరణ, నిర్మాణం నుండి పూర్తి స్థాయి ఉత్పత్తి వరకు – ఈ ప్రాజెక్టు ప్రతి దశలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మా నిరంతర మద్దతు అందిస్తాం. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామికాభివృద్ధికి, అధునాతన ఆవిష్కరణలకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడానికి మేం కట్టుబడి ఉన్నాం. ఎంతో నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాకు 94% మెజారిటీతో మ్యాండేడ్ ఇచ్చారు. ఉద్యోగాల కల్పనకు యువత మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.











**ఎయిర్ పోర్టుకు డైరెక్ట్ కనెక్టివిటీ ఇస్తాం...**

ఎల్‌జి యూనిట్ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం, ఇక్కడ అనుబంధ యూనిట్లతోపాటు ఎల్‌జి సిటీ నిర్మించండి. రాబోయే నాలుగేళ్లలో శ్రీ సిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం తో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తాం.ఆంధ్రప్రదేశ్ వాణిజ్యానికి తమ ద్వారాలను తెరిచే ఉంటుంది, సరికొత్త ఆవిష్కరణల కోసం, మార్పుకోసం ఆతృతగా ఎదురుచూస్తోంది. పరస్పర విశ్వాసం, ఉమ్మడి శ్రేయస్సు, ప్రపంచాన్ని అనుసంధానించే సమిష్టి లక్ష్యంతో కూడిన ఈ భాగస్వామ్యాన్ని మనం కొనసాగిద్దాం.

ఒక ప్రతిష్టాత్మకమైన యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ను ఎంచుకున్న ఎల్ జి ఎలక్ట్రానిక్స్ కు ధన్యవాదాలు. ఎల్ జి ఫ్యాక్టరీ ప్రతి యువ ఇంజనీర్, ప్రతి ఆశావహ సాంకేతిక నిపుణుడు, ప్రతి వ్యవస్థాపకుడికి కలల కర్మాగారంగా మారబోతోంది. మనం కలసికట్టుగా యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం, ఉత్పత్తులను సాధించడమేగాక అవకాశాలను నిర్మించుకుందామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

భారత్‌లో కొరియా రాయబారి లీ సియాంగ్ హూ మాట్లాడుతూగతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో ఆంధ్రప్రదేశ్లో తమ దేశానికి చెందిన కియా కంపెనీ ఏర్పాటైంది. ఇప్పుడు ఎల్‌జి వస్తోంది. రాష్ట్రంలో పారిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందిస్తున్న చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జు జియోన్, భారత్‌లో కొరియన్ రిపబ్లిక్ రాయబారి లీ సియాంగ్ హెూ, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ హెూం సొల్యూషన్స్ సిఈఓ జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సిఈఓ జే సంగ్ లీ, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ జి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భాను ప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీఐఐసి వైస్ చైర్మన్ అభిషిక్త్ కిషోర్, కాన్సులేట్ జనరల్ ఏపీ, తెలంగాణా చక్కపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు పటిష్టంగా చేపట్టాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)**

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు పటిష్టంగా చేపట్టడంతో పాటు యావరేజ్ కూలీ రేట్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా డ్వామా అధికారులను ఆదేశించారు.

గురువారం టంగుటూరు మండలం, జయవరం గ్రామ పంచాయితీలో ఉపాధిహామీ పథకం పనులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా జయవరం గ్రామంలో సాగునీటి కాలువ పూడిక తీత పనులను పరిశీలన చేసి పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల దగ్గరకు జిల్లా కలెక్టర్ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ కూలీలు వారి పనిచేసిన దానికి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి లేనిదీ ఆరాతీశారు. అదేవిధంగా కూలీల హాజరు పట్టిక పని ప్రదేశంలో త్రాగునీరు, నీడ షెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పని చేసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత ఉపాధి హామీ పదకం సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీ మేడపల్లి రాజమ్మ నాకు విడో పెన్షన్ రావడం లేదని, పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వెంటనే పెన్షన్ మంజూరుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓను ఆదేశించారు. గత మూడేళ్ల నుంచి నా భర్తకు ఆరోగ్యం బాగాలేక మంచంలోనే ఉన్నారని, నా కుమారుడు కూడా మరణించడం జరిగిందని, పెన్షన్ మంజూరు చేయాలని గ్రామస్థురాలు యరజర్ల భారతమ్మ జిల్లా కలెక్టర్ ను కోరగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓను ఆదేశించడం జరిగింది. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటితొట్టెటను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. మూగ జీవాల దాహాన్ని తీర్చే ఉద్దేశ్యంతో ఈ పశువుల నీటితొట్టె నిర్మాణాన్ని ఉపాధి హామీ పథకం కింద రూ. 35,783ల ఖర్చుతో నిర్మించడం జరిగింది. అనంతరం ఎరమోసు సుధాకర్ పొలంలో నిర్మిస్తున్న ఫారం పాండ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలన చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో యల్లవరపు వెంకట సుబ్బారెడ్డి ఇంటిపై పిఎం సూర్యఘర్ పథకం కింద నిర్మించుకున్న సోలార్ ప్యానెల్ నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలన చేసారు. జిల్లా కలెక్టర్ వెంట డ్వామా పిడి జోసెఫ్ కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ పేరమ్మ, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీహరిబాబు, ఎంపిడిఓ, డ్వామా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.









# విద్యుత్ శాఖపై జగన్‌వి తప్పుడు ప్రచారాలు

**షార్ట్ టైం పవర్ పర్చేజ్ పేరుతో దోపిడీ..**

రాష్ట్రం విడిపోయిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ గా మార్చారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా వైసీపీకి అప్పగిస్తే 2019 – 2024 వరకు విద్యుత్ రంగాన్ని విధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. షార్ట్ టైం పవర్ పర్చేజ్ పేరుతో ఒక్క సంవత్సరంలోనే రూ.10,000 కోట్లు ఖర్చు చేసి... ప్రజల నెత్తిన మోయలేని భారాన్ని మోపారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఎఫ్.పీ.పీ.ఐ ఛార్జీల పేరిట వేసిన రూ.20,000 కోట్ల విద్యుత్ భారం ప్రస్తుతం ప్రజలపై పడిందన్నారు. దీనిని కూడా కూటమి ప్రభుత్వం వేసిందని అసత్య ప్రచారం చేస్తూ... బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వీటన్నింటిపైనా అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

**కూటమి హయాంలో ఒక్క రూపాయి విద్యుత్ ఛార్జీ పెంచలేదు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీ పెంచలేదని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఇకపై పెంచకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 2022 నవంబర్ లో కేవలం సోలార్ విద్యుత్ ను రూ.5.12 కి యూనిట్ కొనుగోలు చేసేలా వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇదే ఒప్పందం ద్వారా సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ ను యూనిట్ కు రూ. 4.60 కు పీక్ అవర్స్ లో సరఫరా చేసేలా కొనుగోలు ఒప్పందం చేసుకున్నామన్నారు. పీక్ అవర్స్ లో (అత్యధిక వినియోగ సమయం) కూటమి ప్రభుత్వం రూ.4.60కు కొనుగోలు చేస్తున్న యూనిట్ ను వైసీపీ ప్రభుత్వం రూ.9.30కు కొనుగోలు చేసిందని మంత్రి వెల్లడించారు. ఇటువంటి నిర్ణయాలతో ప్రజల నెత్తిన ఐదేళ్లలోనే సుమారు రూ.1.29 లక్షల కోట్ల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాజస్థాన్ సెకీతో చేసుకున్న ఒప్పందంతో డిస్కంలు, ట్రాన్స్ కో, జెన్ కోలు సర్వనాశనం అయ్యాయని తెలిపారు.

**అవినీతి సొమ్ముతో ఏర్పడ్డ మీడియాతో కూటమిపై నిందలు**

అవినీతి సొమ్ముతో ఏర్పడ్డ సాక్షి మీడియాను అడ్డం పెట్టుకుని జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తూ... విష ప్రచారం చేస్తున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జగన్ అవినీతి చర్యలు, అనాలోచిన నిర్ణయాలతో తీవ్రంగా నష్ట పోయిన విద్యుత్ రంగాన్ని మరలా గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ చేపడుతుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచే రాళ్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టారని మండి పడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం చేసే మంచి పనులపై... జగన్ అండ్ కో చేసే అసత్య ప్రచారాలపై ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఏదేమైనా అత్యధిక వినియోగ సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు, రాష్ట్రంలో రైతులు, యువతకు లబ్ధి కలిగించేందుకు విద్యుత్ ఒప్పందాలను చేసుకుంటున్నట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు.

# వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు చేపట్టండి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ వై ఓ నందన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 30 వ డివిజన్ వైయస్సార్ నగర్, మల్లయ్య గుంట, కేంద్రీయ విద్యాలయం, జర్నలిస్టు కాలనీ ప్రాంతాలలో కమిషనర్ గురువారం పర్యటించారు. స్థానిక ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకొని తాగునీటికి సంబంధించిన సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా

## కమిషనర్ వై ఓ నందన్

కమిషనర్ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో తాగునీటి చేతి బోర్ల పనితీరును పరిశీలించి, అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. చేతి బోర్ల మరమ్మతులకు అవసరమైన స్పేర్ పార్ట్స్, అదనపు సిబ్బందిని నియమించుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చేతి బోర్లు అవసరం లేని ప్రాంతాలలో వాటిని పూర్తిగా తొలగించాలని తెలిపారు. అన్ని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు వాటి కెపాసిటీకి తగినట్లుగా నిండేలా చర్యలు తీసుకొని, అనంతరం తాగునీటి సరఫరా చేపట్టాలని సూచించారు. వైయస్సార్ నగర్ పరిధిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా తాగునీటి ట్యాంకర్ల సరఫరా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. మల్లయ్య గుంట ప్రాంతంలో నూతనంగా రోడ్లు, డ్రైన్ కాలువల నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. అదేవిధంగా డివిజన్ వ్యాప్తంగా ఉన్న పార్కులు, ఇతర కార్పొరేషన్ స్థలాలకు నేమ్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక 37వ డివిజన్ క్రాంతి నగర్ ప్రాంతంలో మాజీ మేయర్ భానుశ్రీ తో కలిసి కమిషనర్ వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం 17వ డివిజన్ ఆకుతోట ప్రాంతంలోని డి.ఎస్.కే గార్డెన్స్ తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి ఖాళీ స్థలాలను, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో మేజర్, మైనర్ డ్రైన్ కాలువల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని, వాటి నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు నివేదించాలని కమిషనర్ ఆదేశించారు. నగరవ్యాప్తంగా ఉన్న అన్ని పార్కులలో పచ్చదనం, పర్యావరణానికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ తాగునీటి కుళాయిల ద్వారా నీటి వృధా కాకుండా అన్ని డివిజన్లలో పర్యవేక్షించాలని, అవసరం లేని ప్రాంతాలలోని పబ్లిక్ ట్యాప్లను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు శేషగిరిరావు, ఏ.ఈ అర్చిత, తదితరులు పాల్గొన్నారు.



# నేడు దివంగత మాజీ సీఎం నేదురుమల్లి వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

శుక్రవారం రాజకీయ దురంధరుడు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా వెంకటగిరిలోని స్థానిక నేదురుమల్లి నివాసంలో ఉదయం 8:30 గంటలకు నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. నేదురుమల్లి అభిమానులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేదురుమల్లి అభిమానులు, వైసీపీ శ్రేణులకు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం రైతులకు సన్మానం

(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 8)

వెంకటగిరి డివిజన్ దక్కిలి మండలం పలుగోడు మాటుమడుగు గ్రామంలో బుధవారం నాడు ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సదస్సు నిర్వహించారు నవధాన్యాలు సాగు వల్ల భూమిలో కార్బన్ శాతం పెంచవచ్చని తరువాత భూమి ఆరోగ్యం ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంసిఆర్‌పి శాశం పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి భూగర్భ ఇంటిదగ్గర పెరటి తోటలు వేసుకోవాలని పొలాల్లో నవధాన్యాలు వేయడం వల్ల 365 రోజులు భూమిని కవి ఉంచడం వలన సూర్యకిరణాలు భూమి మీద పడకుండా ఉండటం వల్లన భూమిలో ఉన్న సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమిలో ఎర్రలు అభివృద్ధి చెంది మెరుగైన ఆదాయం బాటల్లో నడవాలి అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు, ఆకుకూరలు ,పండించుకొని తినడం వల్ల మనము మన పిల్లలు ఆరోగ్యంగా ఉంటామన్నారు. మాటు మడుగు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిని పాటించిన రైతు గడ్డం అశోక్‌రెడ్డి తల్లి సుగుణమ్మ సాలవాలతో సన్మానించారు. పలుగోడు గ్రామంలో బుజ్జమ్మకు సాలవాలతో సన్మానం చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ రైతులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీ సుహారలత ఎంసీఆర్ పి శాశం పెంచలయ్య, ఎల్ రజిని, ఎల్ టు పారిజాతం, ఎల్ 3 రమేష్, ఎల్ త్రీ నారాయణ, మాటిమడుగు వివోఏ సంతోష్, నాగమణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





# ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా వాక్థాన్ నిర్వహణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

ఇంటర్నేషనల్ నర్సెస్ డే ను పురస్కరించుకుని, నర్సుల అమూల్య సేవలను గుర్తించి వారికి కృతజ్ఞతలు చెప్పే ఉద్దేశంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, ఒంగోలు వారు ఒక వాక్థాన్ను ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ ఆవరణ నుండి ప్రారంభమైన ఈ వాక్థాన్ దాదాపు 5 కిలోమీటర్ల పాటు సాగింది. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా. నితిన్ నల్లూరి , ఇతర గౌరవనీయులు జెండా ఊపి ప్రారంభించారు. ఆసుపత్రి నర్సులు, సిబ్బంది అందరూ ఈ కార్యక్రమంలో స్ఫూర్తిగా పాల్గొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సానుకూలంగా స్వీకరించి, రోగుల పరిరక్షణలో నర్సుల పాత్రను ప్రశంసించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది మద్దతు లేకుండా రోగుల ఆరోగ్య సంరక్షణ పూర్తిగా సాధ్యం కాదని, రోగుల శ్రేయస్సు కోసం నర్సులు తమ సేవలను మరింత అంకితంగా కొనసాగించాలని కోరుతూ నర్సింగ్ సిబ్బందికి తమ అభినందనలు తెలిపారు. అలాగే మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ రోజంతా అంకితభావంతో సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# కారుణ్య నియామకాలు ఎంపిక జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ , జిల్లా ప్రజా పరిషత్ సీఈవో విద్యారమ , డిప్యూటీ సీఈవో మోహన్ రావు తో కలిసి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు కారుణ్య నియామకాలు కింద 1 వెంకట రమణను మండల ప్రజా పరిషత్ బాలయపల్లి, 2దాస్ ను మండల ప్రజా పరిషత్ తడ, 3 వెంకట సాయి చరణ్ తేజ మండల ప్రజా పరిషత్ తోటపల్లి గూడూరు కు ఆఫీస్ సబార్డినేట్ గా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ చైర్ పర్సన్ అయినా తర్వాత సెప్టెంబర్ 2021 నుండి ఇప్పటి వరకు జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో 76 కారుణ్య నియామకాలు, 107 పదోన్నతులు కల్పించడం జరిగింది. ఇప్పటివరకు ఖాళీ ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాల్గో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు కే భీమిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మాభాష జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిఎం ఆర్యువసేన ఆధ్వర్యంలో భోజనాలు పంపిణి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

బిఎంఆర్యువసేన అధ్యక్షుడు సమీఉల్లా మాట్లాడుతూ గురువారం డోలా పురుషోత్తం పెద్ద ఖర్మ సందర్భంగా వారి కుమారుడు డోలా హరి మరి వరుణ్ మాకు సమాచారం అందిస్తే బి ఎం ఆర్యువసేన ఆధ్వర్యంలో ముంగమూరు అదరణ కేంద్రంతో సభ్యులకు బజార్లో పేదలకు అనాధలకు భోజనం, పండ్లు ,స్వీట్లు పంచారు. వారిని వారి కుటుంబ సభ్యులను దేవుడు నిండు నూరేళ్ళు చల్లగా చూడాలని సమీఉల్లా తెలుపుతూ ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న డబ్బీరు శ్రీధర్ రావుకి , షకీల్‌కి ధన్యవాదాలు తెలిపారు.

# కనుల పండువగా నూతన శిఖర ప్రతిష్ట







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం ఎస్సీ కాలనీలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో కనుల పండువగా నూతన శిఖర ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొని వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శిఖర ప్రతిష్ట కార్యక్రమంలో భాగస్వాములైన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సొంతూరిలో నేను పుట్టిపెరిగిన మా వాళ్ల మధ్య చెన్నకేశవ స్వామి దేవస్థానం ఉత్సవంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రీ చెన్నకేశవ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.


## కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం మేయర్ స్రవంతి జయవర్ధన్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

నెల్లూరు నగర పాలక సంస్థకు సంబంధించి కార్మికుల సమస్యల గురించి గురువారం మేయర్ ను తన చాంబర్ నందు కలిసి వినతిపత్రం అందజేశారు ఏపీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు. ఈ సందర్భంగా మేయర్ప మాట్లాడుతూ నగర పారిశుధ్యంలో కార్మికుల కష్టమే కీలకం అని తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తాం అని మేయర్ తెలిపారు.

## శ్రీ ఆది లక్ష్మి సమేత యోగ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 8)

దక్కిలి మండలం వెంబులూరు పంచాయతీ పెద్దకోన నందు వెలిసియున్న శ్రీ ఆది లక్ష్మి సమేత యోగ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 వ తేది నుండి 11 వ తేది వరకు నిర్వహించుటకు గ్రామస్తులు నిర్ణయించినారు. భక్తులు అందరు బ్రహ్మోత్సవాలు తిలకించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించవలెనని ఆలయ ప్రధాన దాతలు స్వర్గీయ వేపమాను నరసింహులు, చెంచమ్మ (సర్పంచ్ డి వడ్డిపల్లి) తెలిపారు. బ్రహ్మోత్సవాలు వివరాలు మే 9న ధ్వజారోహణం, పల్లకి సేవ, అన్నదానం, మే 10వ తేదీ అభిషేకం, గరుడసేవ, అన్నదానం, మే 11వ తేదీ కళ్యాణత్సవం, తెప్పోత్సవం, అన్నదానం, మహా పూర్ణహుతి జరుగుతుందన్నారు.

## గుండెపోటుతో ప్రయాణికుడు మృతి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 8)

ఆర్టీసీ బస్టాండ్‌లో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన గురువారం పొదిలి బస్టాండ్‌లో చోటు చేసుకుంది. మృతుడి పేరు బండారు వెంకటేశ్వర్లు కాగా, మృతుడికి 65 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు దర్శి మండలం కట్ట సింగపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో గుండెపోటుతో ప్రయాణికుడు ఒక్కసారిగా మృతి చెందడంపై స్థానికులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

## విద్యుత్ షాక్‌తో గృహిణి మృతి

(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, మే 8)

మండల కేంద్రమైన బేస్తవారిపేట అమ్మవారి శాల వీధి వద్ద వేకువ జామున కులాయి నుండి నీరు పట్టే క్రమంలో మోటార్ వైర్ ద్వారా విద్యుత్ షాక్‌కు గురై వివాహిత మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి తెలిపారు.

# కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మె

## ఆపరేషన్ సింధూర్‌కు మద్దతు పలుకుతూ వినూత్న ప్రదర్శన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఏపీఎంసీఏ స్టేట్ ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్ స్పష్టం చేశారు. సమ్మె చేపట్టి పది రోజులైనా ప్రభుత్వం స్పందించకపోవడం నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత 7 సంవత్సరాలుగా ప్రజలకు గ్రామ, కొండ ప్రాంత పధిలో ఆరోగ్య సేవలను అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో గురువారం సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ అనేక ఆర్దికంగా, అర్థికేతర సమస్యల పరిష్కారం కోసం, రావలసిన బెనిఫిట్స్ కోసం చేపట్టిన సమ్మె 10 వరోజుకు చేరిందన్నారు. సమ్మె 10 వ రోజుకు చేరిన ప్రభుత్వం స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ఆరేళ్లు పూర్తి చేసుకున్న సి హెచ్ ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎంలతో సమానంగా 23% వేతన సవరణ చేయాలని, హైక్ అమలు చేయాలని, పెండింగ్ ఇన్సెంటివ్స్ వెంటనే విడుదల చేయాలని, ఇంక్రిమెంట్ పాలసీ ప్రారంభించాలన్నారు. ఈపిఎఫ్టి బెనిఫిట్ ను పునరుద్ధరించాలని, ఎక్స్ గ్రేషియా పాలసీ అమలు చేయాలని, నిర్దిష్టమయిన జాబ్ చార్ట్ అమలు చేయాలనే డిమాండ్స్ ను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెలు మరింత ఉధృతంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామన్నారు. అలాగే వినూత్నంగా ఆపరేషన్ సింధూరకు మద్దతు పలుకుతూ ఫ్లకార్డులు తో వినూత్నంగా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లో 538 మంది సిహెచ్‌ఓలు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, జిల్లా సెక్రెటరీ ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, జయశ్రీ, రమేష్, కామేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



## సబ్సిడీతో కూడిన రుణం అందించి తోడ్పడండి

### పశు సంవర్ధక శాఖ ఏడికి వినతి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

మే 2 వ తేదీన కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గురై కనిగిరి మండలం పోలవరం పంచాయతీ నిమ్మ మహేశ్వరపురం నివాసి నూకతోటి శివపార్వతి భర్త లక్ష్మయ్యకు చెందిన 20 మేకలు మృతి చెందాయి. చనిపోయిన మేకల విలువ ఐదు లక్షల వరకు ఉంటుంది. పిడుగుపాటుకు మొత్తం 20 మేకలు చనిపోవడంతో తమకు బతుకు దెరువు లేకుండా పోయిందని, తాము అప్పులపాలయ్యామన్నారు. కావున చనిపోయిన మేకకు 25000 రూపాయలు వంతున 50% సబ్సిడీతో 5 లక్షలు రుణం అందించి, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడికి వినతి పత్రం అందజేశారు.. అనంతరం ఏడి స్పందిస్తూ బాధితులకు లక్ష యాభై వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లింపు కు, పశు సంవర్ధక శాఖ జెడి ప్రకాశం జిల్లా కలెక్టర్‌కి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, సబ్సిడీతో కూడిన రుణం ఎస్ సి కార్పొరేషన్ నుంచి మంజూరుకు తోడ్పడుతామని ఆయన చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పీవీ శేషయ్య, శాలివాహన సంఘం నాయకులు





## ఉచిత హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

ఒంగోలు పోస్ట్ ఆఫీస్ , పాస్‌పోర్ట్ ఆఫీస్ ఆవరణలో సీనియర్ పోస్ట్ మాస్టర్ బి శ్రీనివాసరావు సహకారంతో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు వారు ఉచిత హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు గురువారం నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంపు నందు సుమారు 120 మందికి షుగరు, బి పి, బి ఎం ఐ వైద్య పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ క్యాంపు నందు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నవారికి ఏడు రోజుల కాల వ్యవధి కల ఉచిత ఓ పి, సి ఆర్ పి, పి పి బి ఎస్, టి ఎస్ హెచ్, ఆర్ ఏ ఫాక్టర్ వైద్య పరీక్షలు హాస్పిటల్లో ఉచితంగా చేయనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి , డాక్టర్ చావల ప్రకాష్ , డాక్టర్ అనిల్ కుమార్, మరియు డాక్టర్ అనపర్తి శ్రీనివాస్, తెలియ చేశారు. హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరం అవుతుందని ఉపాస్ హాస్పిటల్ వైద్య బృందం తెలియ చేశారు. హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నందు అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

రాష్ట్ర సమాచార కమీషనరు, మంగళగిరి వారు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు , ఆయా వార్డు సెక్రటేరియట్ల సిబ్బందికి సమాచార హక్కు చట్టం, 2005 పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని అందరు సిబ్బంది, వార్డు సెక్రటరీలకు 08.05.2025న ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు అవగాహన సదస్సు నగరపాలక సంస్థ కార్యాలయము నందలి కౌన్సిల్ హాలు నందు ఏర్పాటు చేశారు. సదరు సదస్సునకు మేయర్ గంగాడ సుజాత , మునిసిపల్ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, అన్ని విభాగాల నోడల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, శాఖాధిపతులు, ఇన్చార్జి మేనేజర్ వారు హాజరై సిబ్బందికి సమాచార హక్కు చట్టం యొక్క ప్రాముఖ్యత, అవగాహన కల్పించారు. అంతేగాక అర్జీదారులకు తగు సమాచారాన్ని నిర్ధిష్ట సమయములో ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు జారీ చేశారు.






# పొగాకు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)


పొగాకు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఒంగోలులోని త్రోవగుంటలో గల పొగాకు వేలంకేంద్రాన్ని సందర్శించి జరుగుతున్న వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతుల వద్ద నుండి పొగాకు కొనుగోలు విధానాన్ని పరిశీలించి పొగాకు బోర్డు ఆర్ఎం, వేలం నిర్వహణ అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, రైతులతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాల్లో పొగాకు పంట వేసారు, ఎకరాకు ఎంత దిగుబడి వచ్చింది, కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం కౌలు, కూలీ రేట్లు పెరగడం జరిగిందని, గిట్టుబాటు ధరలు లేక పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని, పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటి కీ రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని, రైతులు తెచ్చిన బేళ్లను నోబిడ్ చేయకుండా గిట్టుబా టు ధరకు కొనుగోలు చేయాలని పొగాకు రైతులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యమని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, వేలం నిర్వహణ అధికారి తులసి, ఒంగోలు రూరల్ తహసిల్దార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌ని కలిసిన నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, విజయలక్ష్మీ దంపతులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

జనసేన పార్టీ క్రమశిక్షణ విభాగం హెడ్ ఏపి టిడ్కో చైర్మన్,నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ గత కొన్ని రోజులుగా అస్వస్థతతో విశ్రాంతి తీసుకుంటున్నారు హైదరాబాద్‌లో వారి నివాసంలో వారిని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుగుల కిషోర్,వారి సతిమణి కలిశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుటి నుంచి అత్యున్నత పాలన అందించాలని ఉద్దేశంతో తనకు అప్పగించిన టిడ్కో ఇల్లు పర్యవేక్షణ నిమిత్తం, పార్టీ కార్యక్రమాల నిమిత్తం నిరంతరం తిరుగుతూ కొంత అస్వస్థత లోనై కొద్ది రోజుల నుంచి ఇంటి దగ్గర రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలు తగ్గ నివ్వకుండా దిశానిర్దేశం చేస్తున్న వేములపాటి అజయ్ త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని వారి సేవలను జనసేన పార్టీకి ప్రజలకు అందించాలని కోరుకున్నారు. వారి సూచనలతో జిల్లావ్యాప్తంగా డొక్కా శీతమ్మ పేరున మొదటిగా మజ్జిగ చలివేంద్రం సేవలను ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.



# రెవెన్యూ సేవలను ప్రజలకు అందించే క్రమంలో జవాబుదారీతనంగా ఉండాలి

### అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ సూచన


(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే8)

గురువారం తిక్కన ప్రాంగణంలో రీ సర్వే, డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవిన్యూ సంబంధిత విషయాలపై నెల్లూరు డివిజన్ తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా రెవెన్యూ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా ముందుగా రెవిన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న రికార్డుల జాబితా తయారు చేయాలన్నారు. నోషనల్ ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతుల వద్ద నుంచి నీటి తీరువా పన్నును వసూలు చేయాలని, పన్ను చెల్లించకపోతే ఆయకట్టు విస్తీర్ణ కొలతల్లో తేడాలు వచ్చే అవకాశం ఉందని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే వివిధ రకాల పౌర సేవలకు సంబంధించి ఆయా లబ్ధిదారులకు నేరుగా ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారన్నారు. అలాగే పిజిఆర్ ఎస్ అర్జీల పరిష్కారంలో ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఉదయభాస్కరరావు, ఆర్డిఓ అనూష, సర్వే ఎడి నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 8)

కనిగిరి పట్టణానికి చెందిన విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ యేలం వెంకటయ్య కుమారుడు యాదగిరీష్, భానుశ్రీల వివాహ వేడుక గురువారం కనిగిరి లోని పవిత్ర ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం వైసీపి పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.





# ఉపాధ్యాయుల ధర్నాను జయప్రదం చేయాలి




(షణ్ముఖ వెలుగు, కంభం, మే 8)

ప్రభుత్వ పాఠశాల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ, 9 రకాల బడులతో విద్యా వ్యవస్థ అతలాకుతలం అవుతుందని,ప్రభుత్వ విధానాల వల్ల ప్రాథమిక విద్య దెబ్బ తింటదని దీనిని ప్రతిఘటించాలని ఏపీటిఎఫ్ నాయకులు పగడాల పాండు,అబ్దుల్ కలాం,భాస్కర్ నాయుడు, మల్లికార్జునరావు,రంగస్వామి, అంకిరెడ్డి బృందం తెలిపారు.ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9న ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కంభం మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

# విద్యార్థులకు నీతి కథలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 8)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు ,జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లల్లో వారి సామర్థ్యాన్ని పరీక్షించే కోణంలో వారికి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ వేసవి సెలవుల్లో పిల్లలు గ్రంథాలయాన్ని బాగా ఉపయోగించుకోనేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు గ్రంథపాలకుడు డి కోటేశ్వరరావు కృతజ్ఞలు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విజేతలకు వచ్చే ఆదివారం బహుమతులు అందజేస్తారు.

# దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 8)

సంతనూతలపాడు నియోజకవర్గం అమ్మనబ్రోలు గ్రామంలో బాపట్ల టిడిపి అధికార ప్రతినిధి, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి దశదినకర్మ కార్యక్రమం బుధవారం జరగగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## వెంకటరెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 8)

కనిగిరి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం వైసీపి పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు గురువారం కనిగిరిలోని కొత్తూరులో వెంకటరెడ్డి నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు.రోడ్డు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వింగ్ వైసీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మనేని సుజాత ,మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, రామురెడ్డి, ముత్యాల ప్రతాప్, తదితరులు ఉన్నారు.

## అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ అమౌంట్‌కు రైతు వివరాలు నమోదు చేసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 8)

రైతు సేవ కేంద్రంలో మండల రెవెన్యూలో గల రైతులందరికీ అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ అమౌంట్ కు ,రైతుల పేర్లు తనిఖీకు వచ్చాయని రైతులందరూ వారి యొక్క ఆధార్ కార్డు, 1బి ,బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్ లు రైతు సేవా కేంద్రంలో ఇవ్వవలసిందిగా, ఎవరైతే నమోదు చేసుకోరో వారికి అన్నదాత సుఖీభవ అమౌంటు అకౌంట్లో రాదు అని గురువారం వ్యవసాయ అధికారి పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం

## ఉద్యోగ భద్రతను కల్పించడం మానేసిన కూటమి ప్రభుత్వం
## ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 8)

బాపట్ల పట్టణంలోని జిల్లా వైద్యశాల ఆవరణలో గత పది దినముల నుంచి కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్ఓ)లు ప్లేకట్స్ పట్టుకుని సమ్మె చేస్తున్న కనీస ఏఒక్క అధికారి కానీ ఏ ఒక్క నాయకుడు గాని వారిని పలకరించిన పాపనపోలేదు. వారు ఏమి కొంతెమ్మ కోర్కెలు కోరలేదు. వారు వారికి రావలసిన న్యాయమైన కోర్కెలు.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మా సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం పక్కన పడేసిందని, జిల్లా నందు పనిచేస్తున్న మమ్మల్ని గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్న గత రెండు సంవత్సరాలుగా జీతభత్యాలు విషయంలో తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నామని,2023 ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరూ ఉద్యోగులందరికీ 23% వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమాబాధికరించాలని,ఈ పి ఎఫ్ ఓ పురుధించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్ చాటర్ అందించాలని,ఎఫ్ ఆర్ ఎస్ నుండి సిహెచ్ఓ లను మినహాయింపు నివ్వాలని హెచ్ ఆర్ పాలసీ-ఇంక్రిమెంట్,ట్రాన్స్ఫర్ పితృత్వ సెలవులు మొదలగునవి అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న (10000) పది వేలమంది రోడ్డున పడ్డామని గత ప్రభుత్వం ల కాకుండా కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుంది అనుకుంటే ఉన్నతాధికారులే కాదు కూటమి ప్రభుత్వ పెద్దలు నాయకులు కూడా మమ్మల్ని పలకరించిన పాపాన పోవడం చాలా బాధ కరంగా ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు విచారణ చెందుతున్నారు. గత సంవత్సర కాలంగా పి ఎఫ్‌కి కూడా గతి లేకుండా పోయింది. మా పరిస్థితి,గ్రాడ్యుయేషన్ చేసిన మాకు భిక్షాటన చేసుకునే పరిస్థితిని తేవద్దు అని కూటమి పెద్దలు ఇకనైనా మా సమస్యలను పరిష్కరించి , మా కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వేడుకుంటున్నారు.





## తాటి చెట్టు ఎక్కి జారి కింద పడిన రేవంత్

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 8)

మండల కేంద్రమైన పొన్నలూరులో ఎస్సీ కాలనీ సమీపంలో గురువారం తాటికాయల కోసం గంధం రేవంత్ తాటి చెట్టు ఎక్కి తాటికాయలు కోసే నెపంలో జారీ కిందపడి తలకి గాయం కావడంతో అపస్మారక స్థితికి వెళ్ళారు. దీంతో స్థానికులు వెంటనే 108 సమాచారం అందించడంతో వారు అక్కడ చేరుకుని వైద్య నిమిత్తంకు కందుకూరులో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



# గోనుపల్లిలో అంబరాన్ని అంటిన సంబరాలు

## నవ మధువరులకు గిరిజనుల సారె
## ఉభయదేవేరులతో కొనకు చేరిన నృసింహస్వామి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 8)

నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలం ప్రసిద్ధి పుణ్యక్షేత్ర మైన పెంచలకొన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అత్తారింటి నుంచి కొత్త అల్లుడు ఉభయనాంచారులతో కలిసి పెంచలకొన చేరడంతో పెనుశీల నరసింహుని బ్రహ్మోత్సవాలు అంరంగా వైభవంగా మొదలయ్యాయి.

**పెళ్లి కొడుకైన పెంచల స్వామి**

హిరణ్యకశివుని వదంతం అనంతరం ఉగ్రరూపుడైన స్వామివారు నరసింహ అవతారంలో వెలుగొండల్లో సంచరిస్తుండగా చెంచురాజు కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించారు. ఆమెను పెళ్లి చేసుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. అందువల్ల ప్రతి ఏడాది గోనుపల్లిలో పెంచల నరసింహస్వామి పెళ్ళికొడుకై ఉదయం గిరిజన కాలనీకి వచ్చారు. గోనుపల్లి గిరిజనకాలనీలో పెళ్లి సందడి నెలకొంది. గోనుపల్లిలోని పెంచలస్వామి ఆలయంలో ఉన్న ఉత్సవమూర్తులను దేవాదాయ శాఖ సిబ్బంది గిరిజన కాలనీకి తీసుకువచ్చారు.ఈ మార్గంలో శ్రీవారు పెంచలకొనకు బయల్దేరాల్సి ఉండటంతో దేవ దేవేరులకు తమ చెంతకు రాగానే గిరిజన కాలనీ వాసులు ఆతిథ్యం ఇచ్చి పూజలు నిర్వహించారు. గోనుపల్లి నుంచి పెంచలకొన వరకు పల్లకిలో కొలువు దీర్చి బోయలు మోసుకుంటూ తీసుకువచ్చారు. దేవస్థాన డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, పోలీసులు, భక్తులు స్వామివారి పల్లకి తో వచ్చారు.

**గొల్లబోయికి తొలి దర్శనం**

పెనుశీల లక్ష్మీనరసింహస్వామి గ్రామానికి వచ్చిన తొలిసారి గొర్రెల కాపరికి తొలి దర్శనం ఇవ్వడంతో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోనుపల్లి సమీపంలోని గోల్లబోయిన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారు అప్పట్లో గ్రామానికి చేరుకున్నప్పుడు తమ మహిమలు గురించి గ్రామస్తులకు వివరించి తమకు ఆలయం నిర్మించమని చెప్పి వెను తిరిగి చూడకుండా వెళ్లమని గోల్లబోయిని ఆదేశించారని పురాణాలు చెబుతున్నాయి. అయితే గొల్లబోయి వెనుతిరిగి చూడటంతో శ్రీవారే గొల్లబోయి శిలారూపం దాల్చారని పురాణాలు తెలిపాయి. ఏటా శ్రీవారు సతీసమేతంగా గొల్లబోయికి తొలి దర్శనమిచ్చిన అనంతరం కొనకు చేరుకుంటారు.

**గిరిజనులు సారె**

గోనుపల్లి గిరిజనకాలనీ కొత్త అల్లుడు రాకతో గిరిజనవాడాలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటికి వచ్చి అల్లుడికి గిరిజనులు ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజెటి గడ్డలు, నారె మొలతాడు సారెగా ఇచ్చారు. గిరిజన వాడాలో ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పందిళ్లు వేసి మధూవరులకు ఘన స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకున్న స్వామి అమ్మవార్లను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు గోనుపల్లి గిరిజనవాడకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. పల్లకిలో విశేష అలంకారణలో ఆశీనులైన స్వామి,అమ్మవార్లను చూసిన భక్తులు గోవింద నామ స్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

**కొనకు చేరిన శ్రీ వారు**

గోనుపల్లి గిరిజనవాడ నుంచి ఉభయ నాంచారులతో బయలుదేరిన శ్రీవారు పల్లకిలో కొనకు చేరుకున్నారు. గోవింద నామస్మరణ చేసుకుంటూ పెంచలకొనకు చేరుకున్నారు.

ఆలయ ముఖ ద్వారం వద్ద ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com